సాక్షి చిత్తూరు

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.69

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	18
తిరుపతి	32	18
తిరుమల	30	14
గూడూరు	33	19
నగరి	35	18



అనంతాళ్వారు అవతారోత్సవం

తిరుమల: శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారులలో ప్రముఖుడైన శ్రీఅనంతాళ్వారు 969వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వార్‌తోట(పురశైవారితోట)లో ఆదివారం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

వెండి ఆభరణాల బహూకరణ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన పరచూరి వంశీకృష్ణ ఆదివారం వెండి ఆభరణాలను కానుకగా అందించారు. సాయంత్రం కుటుంబ సమేతంగా ఆయన ఆలయానికి విచ్చేశారు. అధికారులను కలసి 2.7 కిలోల రెండు వెండి బిందెలు, తీర్థపాత్ర, ఉత్తరిణి, అర్చన తట్టను అందించారు. వీటి విలువ రూ. 2.20 లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్

సాక్షి, చిత్తూరు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు 2023కు సంబంధించి అభ్యర్థులు, ఓటర్లు తమ సందేహాల నివృత్తికి, సమస్యలను ఫిర్యాదు చేసేందుకు హెల్ప్ డెస్క్, కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. హరినారాయణన్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటలూ పనిచేసేలా హెల్ప్ డెస్క్ (నంబర్ 08572-242777), కాల్ సెంటర్ (నంబర్ 1950)ను ఏర్పాటు చేశామని తెలిపారు.

పూడి రైల్వే గేటు మూత పొడిగింపు

వడమాలపేట : వడమాలపేట- తిరుచానూరు మార్గ మధ్యంలో పూడి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గేటును మరో రెండు రోజులు రాత్రి పూట మూసివేసి మరమ్మతులు చేపట్టనున్నట్లు పుత్తూరు రైల్వే సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. గతంలో 17వ తేదీ నుంచి 19 వరకు మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు 19వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 20 ఉదయం 6 వరకు, 20వ తేదీ రాత్రి 8 నుంచి 21 ఉదయం 6 వరకు గేటు మూసి వేయనున్నట్లు తెలిపారు. వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని ఎస్పీ తెలిపారు.

రాధిక.. స్ఫూర్తిదాయిక!

"కార్యేషు దాసి.. కరణేషు మంత్రి.. భోజ్యేషు మాత.. శయనేషు రంభ".. పురుషుడి జీవితంలో మహిళ పాత్రకు ఇది అద్భుత విశ్లేషణ. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది రాధిక. సాఫీగా సాగుతున్న జీవితం ఒక్కసారిగా కష్టాలపాలైతే..? కడుపులో చల్ల కదలకుండా చూసుకుంటున్న భర్త హఠాత్తుగా కుర్చీకే పరిమితమైతే..? పెనిమిటి అనారోగ్యానికి అప్పు చేసి రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తే..? బిడ్డల చదువులకు చేసిన రుణాలు తడిసిమోపెడై చుట్టుముడితే..? కుటుంబపోషణే ప్రశ్నార్థకంగా మారితే..? భవిష్యత్ అగమ్యగోచరంగా కనిపిస్తే..? ఊహించుకుంటేనే భయం వేసే పరిస్థితులను రాధిక మనోధైర్యంతో ఎదుర్కొంది. విధి విసిరిన సవాల్‌కు ఎదురొడ్డి నిలబడింది. భర్త, పిల్లల బాగోగులను ఒంటి చేత్తో చూసుకుంటూ ముందడుగు వేసింది. ఒకవైపు వ్యవసాయం.. మరోవైపు ట్రాక్టర్ నడుపుతూ బతుకు బండిని గాడిలోకి తీసుకువచ్చింది. పరీక్షపెట్టిన దేవుడే అబ్బురపడేలా కుటుంబానికి అన్నీతానై అందరితో శభాష్ అనిపించుకుంటోంది.



ఇసుక లోడ్ ట్రాక్టర్ నడుపుతున్న రాధిక

- మహిళాశక్తిని నిరూపిస్తున్న రాధిక
- కష్టాల్లో ఉన్న కుటుంబానికి అన్నీతానై..
- భర్త, బిడ్డల పోషణకు ట్రాక్టర్ నడుపుతూ..
- అందరికీ ఆదర్శంగా నిలుస్తూ..



వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న రాధిక

నగరి : విజయపురం గ్రామానికి చెందిన మునిరాజు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య రాధిక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. షుగర్ వ్యాధి కారణంగా 2019లో తీవ్రమైన అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యాడు. సుమారు రూ.12 లక్షల వరకు వైద్యం కోసం అప్పులు చేసి ఖర్చు చేయాల్సి వచ్చింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో మునిరాజుకు ఒక కాలు తీసేయాల్సి వచ్చింది. దాని ప్రభావంతో మరో కాలు పనిచేయకుండా పోయింది. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా కష్టాల్లో చిక్కుకుంది. అప్పటికే కుమార్తెల చదువు కోసం అప్పులు చేసి ఉన్నారు. దీనికి తోడు వైద్యానికి చేసిన ఖర్చుతో కలిపి మొత్తం రూ.25 లక్షల వరకు అప్పులు తేలాయి. ఇల్లు, మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే వారికి ఉంది. అవి అమ్మేసి అప్పులు తీర్చేద్దామనుకుంటే, పిల్లల చదువుకు ముందు ముందు ఆదరవు లేకుండా పోతుందని ఆందోళన చెందారు. ఇలా ఒక్కసారిగా అన్ని వైపుల నుంచి వచ్చిన కష్టాలు చుట్టుముట్టినా రాధిక ఒంటరిగా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధమైంది.

ధైర్యంగా.. దీటుగా!

కుటుంబపోషణతోపాటు అప్పులు తీర్చాల్సిన బాధ్యత మీదపడినా రాధిక ఏమాత్రం కుంగిపోలేదు. ముందుగా మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేయడం మొదలుపెట్టింది. అలాగే ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకుని తద్వారా కొద్దిపాటి ఆదాయం వచ్చేలా జాగ్రత్త పడింది. విజయపురంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు అక్కడి వారి అవసరాలకు తగ్గట్టు దుక్కులు దున్నడం, ఇసుక, కంకర, గ్రావెల్, ఇటుకలు ట్రాక్టర్‌లో తోలుతోంది. ఇసుక కోసం అయితే గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలోని నగరి నుంచి సరఫరా చేస్తోంది. పురుషులకు దీటుగా ట్రాక్టర్ నడుపుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వ్యవసాయం, ట్రాక్టర్ ద్వారా సమకూరే ఆదాయంతోనే పిల్లలను చదివిస్తోంది. భర్త ఆలనాపాలనా చూసుకుంటోంది. కొద్దిపాటి రాబడిలోనే పొదుపు చేసుకుంటూ.. ఆరేళ్లుగా రూ.18 లక్షల వరకు అప్పు తీర్చింది. ప్రస్తుతం ఒక కుమార్తె బీటెక్ పూర్తిచేసి బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మరో కుమార్తె బీటెక్ చదువుతోంది. కాలు కోల్పోయి కుర్చీకే పరిమితమైన భర్తకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న రూ.5 వేలు పింఛన్ వేన్నీళ్లకు చన్నీళ్లుగా ఉపయోగపడుతోందని రాధిక వెల్లడిస్తోంది.

కష్టం తెలియకుండా..

మా అమ్మ ఎలాంటి కష్టం మాకు తెలియకుండా చదివిస్తోంది. ఏ లోటు రాకుండా చూసుకుంటోంది. ఆమె కష్టాన్ని అర్థం చేసుకుని మేము కూడా శ్రద్ధగా చదువుకుంటున్నాం. అక్క హర్షితకు ఇప్పటికే ఉద్యోగం వచ్చింది. నేను కూడా బెంగళూరులో బీటెక్ చదువుతున్నా. కోర్సు పూర్తి చేసి ఉద్యోగంలో చేరితే మా అమ్మకు అస్సలు కష్టం అనేది లేకుండా చూసుకుంటాం.

– వనజ, రాధిక రెండో కుమార్తె

ఆదర్శంగా నిలిచింది



కుటుంబానికి అండగా నిలవడంతో రాధిక అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. మహిళలు వ్యవసాయం చేయడం సహజమే అయినా, ట్రాక్టర్ నడపడం అంత సులువు కాదు. అందులోనూ మగవారికి దీటుగా ఆమె ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తుంది. లోడ్‌తో ఉన్న వాహనాన్ని సైతం అవలీలగా నడుపుతుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. పురుషులకు ఎందులోనూ మహిళలు తీసిపోరని నిరూపిస్తోంది.

– మురళీధర్ రెడ్డి, సర్పంచ్, విజయపురం

కుటుంబం కోసమే..

కుటుంబ పోషణ కోసం ఎంత కష్టమైనా భరించాలని ముందడుగు వేశా. నాకే ఈ పరిస్థితి వచ్చి ఉంటే నా భర్త నన్ను కాపాడేవారు కదా. అలాగే నేనూ భావించా. అందుకే ఎంతటి భారమైనా మోయాలి అనుకున్నా. బీఏ వరకు చదివినా ఉద్యోగం కోసం భర్తను వదిలివెళ్లలేకపోయా. మా పొలంలో వ్యవసాయం చేస్తూ ట్రాక్టర్ నడపడం నేర్చుకున్నా. ప్రస్తుతం చెరుకు, వేరుశనగ సాగు చేస్తున్నా. వ్యవసాయ పనులు లేని సమయంలో ట్రాక్టర్‌లో ఇటుక, కంకర, గ్రావెల్, ఇసుక తోలుతూ కొంత సంపాదిస్తున్నా. ఇంటి ఖర్చులు, పిల్లల చదువుకు పోను మిగిలిన సొమ్ము పొదుపు చేసి అప్పు తీరుస్తున్నా. ప్రస్తుతం మా పెద్ద కుమార్తె ఉద్యోగం చేస్తూ అండగా ఉంది. రెండో బిడ్డ కూడా ఉద్యోగంలో చేరితే మా కష్టాలు గట్టెక్కినట్టే.

– రాధిక, మునిరాజు భార్య



భారం తనపై వేసుకుంది

అక్క కుమార్తెనే నేను వివాహం చేసుకున్నా. హాయిగా సాగుతున్న మా జీవితంలో హఠాత్తుగా పెద్ద కష్టం వచ్చిపడింది. ఇక మా కుటుంబాన్ని ఎవరు కాపాడుతారని భయపడ్డా. ఇద్దరు పిల్లలు, భార్య పరిస్థితి ఎలా అని ఆందోళన చెందా. వీళ్లను పోషించడం ఎలా అని ఆవేదన చెందా. ఈ సమయంలో మొత్తం భారాన్ని నా భార్య తనపై వేసుకుంది. కష్టనష్టాలకు ఎదురీదుతూ మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది.

– మునిరాజు, రాధిక భర్త

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

- వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు
- కస్టమర్ కేర్ సెంటర్ల ఏర్పాటు
- సాగుకు అంతరాయం లేని విద్యుత్
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- మాజీ మంత్రి కుతూహలమ్మకు నివాళి
- ఎన్నికల నిబంధనల మేరకు జెడ్పీ సర్వసభ్య సమావేశం





సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కుతూహలమ్మ మృతికి మౌనం పాటిస్తున్న సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం ఎన్నికల నిబంధన మేరకు నిర్వహించారు. తొలుత మాజీ మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ కుతూహలమ్మకు నివాళి అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నాయని వేసవిలో ఎటువంటి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రజలకు తాగునీటి అసౌకర్యం కలుగకుండా ఆయా శాఖల అధికారులు కస్టమర్ కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నా ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే వాటిని తక్షణం పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. వ్యవసాయానికి ఆటంకం లేని మెరుగైన విద్యుత్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీలు పరిశీలించాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌కో అధికారులు క్షేత్రస్థాయిలో లైన్ సర్వే చేయాలన్నారు. సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలియజేసి తక్షణం పరిష్కరించాలని తెలిపారు. తరుచూ లోడ్ మానిటరింగ్ చేసి మెరుగైన సరఫరా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, జెడ్పీ వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, మేయర్ అముద, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు కుప్పంలో ఏకసభ్య కమిషన్ పర్యటన

సాక్షి, చిత్తూరు: కుప్పం, గుడుపల్లె మండలాల్లో వాల్మీకి, బోయ కులస్తుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు ఏకసభ్య కమిషన్ శామ్యూవేలు ఆనంద కుమార్ పర్యటించనున్నారని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఏ.మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం కుప్పం మండలం, ఉరినాయన పల్లె, గుడుపల్లె మండలం సోడిగాని పాళ్యంలో వాల్మీకి, బోయ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అనంతపురం జిల్లా కేంద్రీయ విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది, విద్యార్థులు నిర్వహించే సర్వే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 21న మంగళవారం ఉదయం మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో అన్నమయ్య జిల్లాకు సంబంధించి వాల్మీకి, బోయ కులస్తుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మదనపల్లె నుంచి చిత్తూరు చేరుకుని సాయంత్రం 4 గంటలకు చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగే వాల్మీకి, బోయ కులస్తుల సమావేశంలో పాల్గొని తిరుపతికి వెళతారు.

పుష్కరిణి పులకించె.. భక్తజనం తరించె!





సుగంధ సుమాలు.. సప్తవర్ణకాంతులీనే విద్యుద్దీపాలు.. సుమనోహరంగా సిద్ధం చేసిన తెప్పలపై స్వర్ణాలంకారభూషితులైన శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు కొలువుదీరారు. వేలాదిమంది భక్తుల శివనామస్మరణల నడుమ నారద పుష్కరిణిలో జల విహారం చేశారు. మంగళవాయిద్యాలు.. బాణసంచా వెలుగులు.. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా ఐదు ప్రదక్షిణలు చేస్తూ పురజనులకు దర్శనమిచ్చారు. ఆదిదంపతుల వైభవాన్ని వీక్షించిన భక్తులు తరించారు. జన్మ చరితార్థమైందని పరవశించారు.

– శ్రీకాళహస్తి

మాతృభాషతోనే మనుగడ



జడ్జి కరుణకుమార్ న్యాయ శిరోమణి బిరుదును ప్రదానం చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిత్తూరు, రూరల్: మాతృభాషతోనే మానవాళికి మనుగడ సాధ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ ఉద్ఘాటించారు. నగరంలోని రెడ్డి భవన్‌లో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు మక్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'విశ్వ వేదికపై తెలుగుభాష నాడు-నేడు'పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ తెలుగు భాష పూర్వ వైభవానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆంగ్లం నేర్చుకోవడంలో తప్పు లేదని, తెలుగుభాషను విస్మరించకూడదని తెలిపారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణస్వామి మాట్లాడుతూ తెలుగుభాష, భావాలకు శాస్త్రీయం నేర్పిన వీరేశలింగం పంతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సాహితీ వేత్తలు, సంఘ సేవకులు 20 మందికి కందుకూరి వీరేశలింగం అంతర్జాతీయ పురస్కారాలు-2023 ప్రదానం చేశారు. జడ్జి కరుణకుమార్‌కు న్యాయ శిరోమణి, సాహితీవేత్త మక్రిపూడి దేవేంద్రరావుకు సహజ సంఘ సంస్కర బిరుదును శ్రీవేంకటపద్మావతి చారిటబుల్ ట్రస్టు (తిరుపతి) నిర్వాహకులు ప్రదానం చేశారు. సాహితీవేత్తలు నందిపాటి చక్రపాణి, గొడుగుచింత గోవిందయ్య, జి.శాంతకుమారి, కొఠారి వెంకటరత్నం, దూబగుంట రామకృష్ణ, సోము ఉమాపతి, కన్నయ్య, బాలచంద్ర, గోవిందన్, సంఘ సేవకులు బి.కోటీశ్వర మొదలియార్, నేతాజీ, హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన భక్తిభావం

- అంకాళ పరమేశ్వరికి విశేష పూజలు
- నీవానది ఒడ్డున శ్మశాన కొల్ల ఉత్సవం
- మట్టి ప్రసాదం కోసం ఎగబడిన జనం



ఉత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తజనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శ్మశానకొల్ల(మయానసేవ) ఉత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అంకాళపరమేశ్వరి తల్లికి విశేష పూజలు చేసి సుందరంగా అలంకరించి నీవానది ఒడ్డుకు తీసుకొచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్త జనసందోహం నడుమ దక్ష సంహారాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈసారి వేడుకగా నిర్వహించారు. ముందుగా గుర్రప్పనాయుడువీధి, గిరింపేటలోని అంకాళ పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తరువాత వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ప్రభపై అమ్మవార్లను ఆశీనులను చేసి నీవానది ఒడ్డున మైదానంలో కొలువుదీర్చారు. ముందుగా మైదానంలో మట్టితో భారీ దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దారు. ఆ ప్రతిమకు భక్తులు పిండి వంటలను నివేదించారు. కర్పూర హారతులు వెలిగించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారు మైదానానికి చేరుకోవడంతో అంకాళపరమేశ్వరి నామస్మరణలు జోరందుకున్నాయి. అమ్మవారు దక్ష సంహరించే ఘట్టం పూర్తయిన వెంటనే భక్తులు ఆ మట్టి కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. ఈక్రమంలో పలువురు మహిళలు పూనకంతో ఊగిపోయారు. అమ్మవారి హారతి, నిమ్మకాయలను అందుకోవడం కోసం భక్తులు పోటీ పడ్డారు. అనంతరం అమ్మవార్లు నగర ఊరేగింపునకు బయలుదేరారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

జనమేజనం

కోవిడ్ ఆంక్షలతో రెండేళ్ల పాటు ఉత్సవాన్ని ఆలయానికే పరిమితం చేశారు. ఈ సారి జన జాతరను తలపించింది. శ్మశానకొల్ల మైదానం మొత్తం జనం నిండిపోవడంతో కాలువ గట్టు, ప్రహరీ గోడలు, పెద్ద పెద్ద భవనాలపై నుంచి కూడా భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతను కల్పించారు. సుమారు 20 వేలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఉత్సవ, ఆలయ ట్రస్టు చైర్మన్ కె.ఎం కుమార్ తెలిపారు.



అమ్మవారి ఊరేగింపు



మట్టి ప్రసాదాన్ని తీసుకెళుతున్న భక్తులు

తెలుగు భాషా రక్షణకు నడుం బిగించాలి


సత్కారం అందుకుంటున్న రచయితలు

గంగవరం: తెలుగు భాషా పరిరక్షణకు ఎవరికి వారు నడుం బిగించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు అన్నారు. ఆదివారం కళామందిరంలో 'తెలుగు భాషా రక్షణకు మీరేం చేయగలరు' అనే అంశంపై వంద మంది రచయితలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నుంచే తెలుగు భాషా పరిరక్షణ ప్రారంభం కావాలని తెలిపారు. ముఖ్య అతిథి విశ్రాంత ఆచార్యులు వల్లేరు హరినాయుడు మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం లేకుండా ఇతర భాషలు నేర్చుకోవడం కష్టతరమన్నారు. మాతృభాషాభిమానంలో తమిళులను, కన్నడులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. పాల్గొన్న రచయితలందరినీ ఎస్‌కేఎస్ ఫౌండేషన్ తిరుపతి, మదర్‌థెరిసా విద్యాసంస్థల సహకారంతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రచయితలు మాధవరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, శివశంకర్‌రెడ్డి, పుష్ప, శ్రీపురం సీతారామయ్య, అవిలాల శ్రీధర్, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

20 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు

కుప్పం: కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నంతో పాటు మరో 20 మందిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదుచేసినట్లు కుప్పం పోలీసులు తెలిపారు. చంద్రబాబుపై పోలీసు కేసు నమోదు కావడం పట్ల కుప్పం టీడీపీ నాయకులు శనివారం స్థానిక బస్టాండు ఆవరణలో నిరసన ర్యాలీ చేపట్టారు. నినాదాలు చేశారు. దీనిపై కుప్పం మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుమ్మాకు చెక్

పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం తాజాగా అమలు చేసిన మొబైల్ అలర్ట్ సందేశం విధానానికి మంచి స్పందన లభిస్తోంది. నాడు–నేడుతో ఇప్పటికే కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సమకూర్చి, మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తోంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి బైజూస్ కంటెంట్‌తో బోధన ప్రారంభించింది. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా లేదా అనే అంశంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లక పోతే తల్లిదండ్రులకు సందేశం అందే విధానం తీసుకువచ్చింది.

- బడికి డుమ్మా.. ఇక ఉండదు
- విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ
- రోజూ పాఠశాలకు వెళ్లేలా హాజరు అలర్ట్ మెసేజ్
- ప్రభుత్వ చర్యలపై తల్లిదండ్రుల హర్షం


విద్యార్థులు

నగరి : పాఠశాలలకు డుమ్మా కొట్టే విద్యార్థులకు ఇక చెక్ పడినట్లే. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొబైల్ అలర్ట్ సందేశంతో తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెడుతున్నారు. నగరి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు సుమారు 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యార్థులంతా వంద శాతం హాజరై తద్వారా అమ్మ ఒడి పథకాన్ని అందుకోవాలనే ఉద్దేశంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ మొబైల్ అలర్ట్ సందేశం తల్లిదండ్రులకు వెళ్తోంది. ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమయం దాటినా రాకుంటే..

విద్యార్థులు ఉదయం 10.30 గంటలలోపు పాఠశాలకు హాజరు కాకపోతే.. మీ అమ్మాయి అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా తలిదండ్రులకు నేరుగా మొబైల్‌కు సందేశం చేరవేస్తారు. దీని కోసం ముందుగా విద్యార్థుల తల్లి, తండ్రి, సంరక్షుని మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరించి సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



స్కూల్ అటెండెన్స్ యాప్

వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత గ్రామ వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరవేస్తారు. దీంతో వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్, హెచ్‌ఎంతో కలసి విద్యార్థి ఇంటికి వెళ్లి పాఠశాలకు ఎందుకు రావడం లేదనే విషయాన్ని తెలుసుకుంటారు. ఇలా రూపొందించిన ఈ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కారణంగా బడిబయట విద్యార్థులు ఇద్దరిని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మళ్లీ చేర్చారు. విద్యారంగంపై ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తల్లిదండ్రులు చెబుతున్నారు.


బడిబయట విద్యార్థులను ఎం.కొత్తూరు పాఠశాలలో చేర్పిస్తున్న వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్

విద్యపై ప్రభుత్వం శ్రద్ధ



మా అమ్మాయి భువనేశ్వరి తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. ఏదైనా కారణంతో స్కూలుకు వెళ్లకపోతే మెసేజ్ వస్తోంది. వరసగా రెండో రోజు వెళ్ల లేదా వలంటీర్లు ఇంటికి వచ్చి అడుగుతున్నారు. ప్రభుత్వం విద్యపై ఎంత శ్రద్ధ చూపుతుందో ఈ విధానం వల్ల తెలుస్తోంది. విద్యకు ఇంతలా ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రిని ఇప్పటివరకు చూడలేదు. ముఖ్య మంత్రి జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు. – పార్వతి, సుందరమ్మ కండ్రిగ,

చాలా మంచి విధానం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లక పోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీనివల్ల పాఠశాలల్లో వంద శాతం హాజరు అమలవుతోంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తుంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం.
–ఎస్. అయ్యప్ప, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, జెడ్పీహెచ్ఎస్, ముడిపల్లి

పూర్తి స్థాయిలో హాజరుకు..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తుంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లక పోతే తల్లిదండ్రులకు సందేశం వెళ్లే కొత్త విధానం తీసుకువచ్చింది. దీనివల్ల హాజరు శాతం మెరుగవుతుంది. విద్యార్థులు పాఠశాలలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తుంది. బడి బయట పిల్లలు మళ్లీ బడికి వస్తున్నారు.
– పీఎస్ శ్రీదేవి, ఎంఈఓ, నగరి మండలం

ఘనంగా స్విమ్స్ యూనిఫెస్ట్ -2023


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

తిరుపతి తుడా : స్విమ్స్ యూనిఫెస్ట్–2023తోపాటు 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్విమ్స్ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, స్పోర్ట్స్ డే కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ సింగ్, సభ్యులు మాధవి, సుధారాణి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం కలుగుతాయని తెలిపారు. నేటి యువత క్రీడలపై శ్రద్ధచూపాలన్నారు. అనంతరం యూనిఫెస్ట్–2023 క్రీడా పోటీల్లో జావిలిన్ త్రో పురుషుల జట్టులో డానియల్ నాయక్ మొదటి స్థానం, బి.ఉదయ్‌కుమార్ రెండో స్థానం, డి.చంద్రశేఖర్ మూడో స్థానంలో నిలిచారు. అలాగే షాట్‌పుట్ బాలికల జట్టులో దివ్య మొదటి స్థానం, జి.శరణ్య రెండో స్థానం, జాన్వీ మూడో స్థానంలో నిలిచారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

బైరెడ్డిపల్లె : మండలంలోని ధర్మపురి పంచాయతీ పరిధి మేకలనాగిరెడ్డిపల్లెలో మహిళ ఆత్మహత్య ఘటన శనివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. బైరెడ్డిపల్లె పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిన్నరాజ ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. భార్య కళావతమ్మ (43)ప్రవర్తనను అనుమానించి కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట నిలదీశారు. మనస్తాపం చెందిన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామ సమీపంలోని అటవీప్రాంత సరిహద్దుల్లోని వ్యవసాయ బావిలో శవమై తేలుతుండగా శనివారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి అన్న శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

టీడీపీలో బీసీలను అణచి వేస్తున్నారు

- పులివర్తి నాని తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ నుంచి బీసీలను తరిమేస్తున్నాడు
- మీడియాతో బీసీ నాయకుడు షణ్ముగం



చిత్తూరు రూరల్: టీడీపీలో బీసీలను, బీసీ నాయకులను పార్టీ నుంచి కొట్టి తరిమేస్తోంది ముమ్మాటికీ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు పులివర్తి నానినే అని బీసీ నాయకులు షణ్ముగం తీవ్ర ఆరోపణలు చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను 34 ఏళ్లుగా టీడీపీ కోసం పని చేశానన్నారు. అయితే తాను బీసీ నాయకుడని, పులివర్తి నాని తన స్వార్థ రాజకీయాల కోసం కక్ష కట్టి పార్టీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తనను తొలగించేలా చేశారని ఆరోపించారు. అందుకే తాను టీడీపీ క్రియాశీలక సభ్యత్వానికి తాను రాజీనామా చేసినట్లు తెలిపారు. నాని తనపై చేసిన దౌర్జన్యాలను, హింసించిన విషయాలను, చివరకు కొట్టడానికి వచ్చిన విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తే, దీనిపై విచారించిన ఇద్దరు నేతలు కూడా నానివైపే ఉన్నారని తెలిపారు. తనతో పాటు బీసీ నాయకులు అశోక్‌నంద యాదవ్, నందగోపాల్ వంటి సీనియర్ నాయకులను సైతం పార్టీలో పూర్తిగా పక్కన పెడుతున్నారని దుయ్యబట్టారు. చాలామంది నాని వల్ల ఇబ్బంది పడుతున్నారని, చిత్తూరులో లోకేష్ పాదయాత్ర ఫెయిల్యూర్ కావడానికి ప్రధానంగా నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబే కారణమన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కూడా ఈ ఇద్దరి వల్లే పార్టీకి తీవ్ర అన్యాయం జరిగిందని షణ్ముగం ఆరోపించారు.

తిరుమల ఘాట్ రోడ్‌లో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



తిరుమల: తిరుమల ఘాట్ రోడ్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. తిరుపతి డిపోకు చెందిన బస్సు ఉదయం తిరుమల రెండో ఘాట్ రోడ్ ద్వారా బయలుదేరింది. భాష్యకారుల సన్నిధి సమీపంలో జీపు, ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, టీటీడీ ఉద్యోగులకు స్వల్పంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు సిబ్బంది బస్సును పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు వాహన చట్టాలపై సదస్సు

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ చట్టాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు డీటీసీ బసిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, శాఖ అధికారులు, సిబ్బందితో పాటు వాహనదారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి


పక్షుల కేంద్రంలో గూడబాతుల పిల్లల గుంపు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఆదివారం సందర్శకుల సందడితో ఆహ్లాదంగా మారింది. ప్రస్తుతం పక్షి పిల్లలు అన్ని ఎగిరే స్థాయికి చేరుకున్నాయి. వీటి కిలకిలారావాలు సందర్శకులకు ఆకట్టుకుంటున్నాయి. పక్షుల కేంద్రంలో ఎంతో అందమైన విదేశీ వలస విహంగాలు ఓవైపు ఆకట్టుకుంటుంటే మరో వైపు పచ్చని చెట్లు, పంట పొలాలు వంటి ఆహ్లాదకమైన వాతవరణం హాయినిస్తుందని పలువురు సందర్శకులు తెలిపారు. ఇక్కడికి విచ్చేసే సందర్శకుల కోసం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు పక్షుల జీవన శైలి, వాటి ఆహారపు అలవాట్లు తెలియజేసేందుకు ఫారెస్ట్ సిబ్బందితో పాటు, ఓ నేచర్ గైడ్‌ను చెరువు కట్టపై ఉన్న వ్యూపాయింట్లు వద్ద ఏర్పాటు చేశారు. విహంగాలను దగ్గర వీక్షించేందుకు బైనాక్యూలర్స్, పర్యాటకులు సేద తీర్చే విధంగా అక్కడక్కడ బెంచీలు వంటి వసతులు కల్పించారు. తాగు నీటి సౌకర్యార్థం శుద్ధి నీళ్ల సైతం వన్యప్రాణి విభాగం అధికారులు కేంద్రంలో కల్పించారు.

• రంకేసిన ఉత్సాహం

కోడె గిత్తల దూకుడు.. ఎద్లను కట్టడి చేసి పట్టీలు పట్టిన యువత చిందులు..బాణసంచా మోతలు.. కేకలతో ఆదివారం మండలంలోని సద్దికూళ్లపల్లెలో జరిగిన ఎండ్ల పందేలు దుమ్మురేపాయి. ఎద్ల పౌరుషానికి యువత సాహసానికి మధ్య సై అంటే సై అన్నట్లు జల్లికట్టు ఉత్కంఠభరితంగా సాగింది. కొన్ని కోడెగిత్తలు యువతను చిత్తు చేశాయి. తొలుత నిర్వాహకులు ఎద్లకు పలకలు, వస్త్రాలు, బెలూన్‌లతో పాటు వివిధ రాజకీయ పార్టీల జెండాలు కట్టి పందేనికి ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చాయి. ఎద్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువకులు వాటి వెంట పరుగులు తీశారు. యువకులు వీరత్వంతో కొన్ని ఎద్ల వేగాన్ని కట్టడి చేసి తమ ప్రతాపాన్ని చూపారు. - వెదురుకుప్పం









కాలుదువ్విన కోడెగిత్తలు

- ఉరకసిన యువకులు
- జనసంద్రంగా మారిన గంగుడుపల్లి


పరుగులు తీస్తున్న కోడెగిత్తలు

చంద్రగిరి: మండలంలోని గంగుడుపల్లిలో ఆదివారం ఎద్ల పందేలను ఘనంగా నిర్వహించారు. పశువులను అందంగా అలంకరించి వీధిలోకి వదిలి బెదిరించారు. కాలుదువ్విన కోడెగిత్తలను అదుపు చేసేందుకు యువకులు సై అంటే సై అంటూ వాటి వెంట పడ్డారు. కోడెగిత్తలను నిలువరించి వాటికి కట్టిన చెక్క పలకలను సొంతం చేసుకునేందుకు పోటీ పడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో సందడి నెలకొంది. వారికి స్థానికులు మజ్జిగ పంపిణీతోపాటు అన్నదానం చేశారు.


జనసంద్రంగా మారిన గ్రామం